క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు

పాకాల : మండలంలోని ఇరంగారిపల్లి పంచాయతీ పాలిసేనివారిపల్లికి చెందిన నూతన వధూవరులు మహ్మద్‌షరీఫ్, షేక్ తహీరకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నేంద్రగుంట డివిజన్ అధ్యక్షుడు గుండ్లూరి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్, నంద, కలాం, జాబీర్, సుజాత, ఉమాపతి, దస్తగిరి, రెహ్మాన్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు అందజేశారు.

శ్రీనివాస మంగాపురంలో చలువ పందిళ్లు ఏర్పాటు



చంద్రగిరి(తిరుపతి రూరల్): వేసవిలో భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో కూలర్లు పెట్టారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఆలయంలో ఏసీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రానున్న వారం రోజుల్లో ఆలయంలో ఏసీలు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని అధికారులు తెలిపారు.

డ్వాక్రా మహిళకు ఆర్థిక సాయం



ఆఫ్రీన్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఏపీఎం, సీసీ, సభ్యులు

భాకరాపేట : రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన డ్వాక్రా సంఘం మహిళకు తోటి సభ్యులు, ఏపీఎం, సీసీలు ఆర్థిక సాయం అందించారు. చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లెకు చెందిన నాగూర్ షరీఫ్ స్వయం సహాయక సంఘం సభ్యురాలు ఆఫ్రిన్ భర్త మహమ్మద్‌రఫీ ఏప్రిల్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నా రు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్ర మే. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రూపు సభ్యులు రూ.23,500, ఏపీఎం కుమార్ .1000, సీసీ సురేంద్ర రూ.500 పోగుచేసి బుధవారం ఆఫ్రీన్‌కు అందజేశారు.


రేపటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: జీవకోన జీవలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోనున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవం శుక్రవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు రాచగుండ్ల చంద్రశేఖర్ విశ్వకర్మస్వామి తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో స్వామి వారి కల్యాణోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. 21వ తేదీన వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా పీసీ రాయలు



తిరుపతి కల్చరల్: కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయలును రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి, పంచాయత్‌రాజ్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ మూడేళ్లు కొనసాగుతుంది. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎంవోఆర్‌డీ అండ్ పీఆర్ అన్ని కార్యకలాపాలను సమీక్షిస్తుంది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని బుధవారం ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ రైల్వే బోర్డు మోహిత్ సిన్హా, ఏపీ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ రమాకాంత్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

విశ్వరూప అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు. (ఇన్‌సెట్) భక్తులకు తిలకం దిద్దుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



వెంకన్న చెల్లికి వేల వందనాలు

తిరుమల వెంకన్న చెల్లెలుగా భక్తకోటి పూజలందుకుంటున్న తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను వారం రోజులుగా అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. రోజూ వేలాది మంది భక్తులు వివిధ వేషాలు ధరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చివరి రోజు మంగళవారం అర్ధరాత్రి తర్వాత కొలువు తీరిన గంగమ్మ విశ్వరూపాన్ని దర్శించుకునేందుకు వేలాది మంది తరలివచ్చారు. జాతర చివరి రోజు రాత్రి పేరంటాల వేషధారుడు కైకాల కులస్తుడు నగరంలో విహరిస్తూ భక్తుల పూజలందుకున్నారు. బుధవారం వేకువ జామున 2.56 గంటలకు తాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని చేరుకుని గంగమ్మ విశ్వరూప ప్రతిమ చెంపనరకడంతో జాతర సమాప్తమైంది. ఈ సందర్భంగా అమ్మా.. గంగమ్మా... చల్లంగా చూసి కాపాడవమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు.

– తిరుపతి కల్చరల్



అమ్మవారిని దర్శించుకుంటున్న యువతులు



భక్తులకు నమస్కరిస్తున్న పేరంటాల వేషధారణలో ఉన్న కైకాల వంశస్తులు



అమ్మవారి విశ్వరూపాన్ని మొబైల్ ఫోన్లలో చిత్రీకరిస్తున్న భక్తులు

21 నుంచి గోవిందుడి విమాన గోపుర మహాసంప్రోక్షణ

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపుర మహా సంప్రోక్షణ కార్యక్రమం ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే 26 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ రెండు కార్యక్రమాల ఏర్పాట్లపై బుధవారం రాత్రి టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మహాసంప్రోక్షణకు 20వ తేదీన అంకురార్పణ చేస్తామని, 21 నుంచి 24వ తేదీ వరకు వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 25న పూర్ణాహుతి, మహా సంప్రోక్షణ నిర్వహిస్తామని వివరించారు. 20 నుంచి 25వ తేదీ వరకు ఆలయంలో ఊంజల్ సేవను రద్దు చేసినట్టు తెలిపారు. ఈ నెల 25న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తామని, పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ ఎస్ఈసీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ ఈవోలు శాంతి, గోవిందరాజన్, ఈఈ మనోహర్, వీజీవో మనోహర్, అదనపు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

పాకాల : మండల కేంద్రంలోని సత్యమ్మ ఆలయంలో బుధవారం గంగజాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. కోర్కెలు నెరవేరిన వారు అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మట్టితో చేసిన అమ్మవారి విగ్రహాన్ని విశేషంగా అలంకరించి ఊరేగించారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి భక్తులు హారతులు పట్టారు.



బ్యాట్ పట్టి.. ఉత్సాహపరిచి..

కళ్లజోడు, టోపీ పెట్టి.. చేతిలో బ్యాట్ పట్టుకుని యువకుడిలా కనిపిస్తున్న ఈయన ఎవరో కాదు.. నిత్యం ప్రజాసేవలో పరితపించే నాయకుడు.. ప్రతిపక్షాలను మాటల తూటాలతో చెడుగుడు ఆడే డిప్యూటీ సీఎం నారాయణస్వామి. బుధవారం ఆయన తుమ్మలగుంట మైదానంలో జరుగుతున్న చంద్రగిరి ఐపీఎల్ మ్యాచ్‌లను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా బ్యాటింగ్ చేసి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి చెవిరెడ్డి ఫ్యామిలీ ఇంత పెద్ద టోర్నీ నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. – తిరుపతి రూరల్

గంగమ్మ జాతరపై టీడీపీ నేతల విషప్రచారం దుర్మార్గం

- ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్
- చంద్రబాబు ఏనాడైనా అమ్మవారిని దర్శించుకున్నారా అని ప్రశ్న



మీడియాతో మాట్లాడుతున్న గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టాగోపీయాదవ్

తిరుపతి కల్చరల్: మునుపెన్నడూ లేని విధంగా గంగమ్మ జాతర దిగ్విజయం నిర్వహించామని, దీన్ని చూసి ఓర్వలేని టీడీపీ నేతలు వక్రబుద్ధితో రాజకీయంతో విమర్శలు చేయడం దుర్మార్గమని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ ధ్వజమెత్తారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి గంగ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కృషి చేశారని తెలిపారు. జాతర వైభవాన్ని దేశ వ్యాప్తం చేయాలనే ఉద్దేశంతో నగర ప్రముఖులతో చర్చించి ప్రణాళికాబద్ధంగా, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారని వివరించారు. దీన్ని వక్రబుద్ధితో విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. అత్యంత ప్రాచీన చరిత్ర కలిగి, తిరుమల శ్రీవారి చెల్లెలుగా కీర్తి అందుకున్న గంగమ్మను టీడీపీ అధినేత చంద్రబాబు ఏనాడైనా దర్శించుకున్నారా అని ప్రశ్నించారు. ఎస్వీ మ్యూజిక్ కళాశాల ఎదురుగానున్న పెంచలయ్య అంగట్లో తాను సిగరెట్ల కోసం చేసిన అప్పుడు ఇప్పటి వరకు చెల్లించలేదని బాబే స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. ఇలాంటి విషయాలు జ్ఞాపకం ఉన్న బాబుకు తిరుమల శ్రీవారి చెల్లెలైన గంగమ్మను దర్శించుకోవడం లేదన్నారు. గంగమ్మ జాతర అంగరంగ వైభవోపేతంగా జరగడంతో పాటు విజయవంతానికి కృషి చేసిన టీటీడీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, తుడా, పోలీసులు, ఎస్పీడీసీఎల్, హెల్త్ విభాగం అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ దుర్గంధంలో బొమ్మగుంట



వీధి మధ్యలోని మ్యాన్ హోల్ నుంచి ప్రవహిస్తున్న వ్యర్థ జలం



ఇంటి ముందున్న మ్యాన్ హోల్ నుంచి వెలుపలకు వస్తున్న వ్యర్థ జలం

- పాడైపోయిన భూగర్భ డ్రెయినేజీ
- నెల రోజులుగా రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు
- కొత్త యూడీఎస్ కొత్త లైన్ వేస్తామంటున్న అధికారులు
- పట్టించుకోని కాంట్రాక్టర్
- దుర్గంధంతో జనం ఇక్కట్లు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని 31వ డివిజన్ బొమ్మగుంటలో ఇళ్ల ముందు మురుగునీరు ప్రవహిస్తుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొమ్మగుంట మధ్యలోని వీధిలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ పాడైపోయింది. దీంతో నెల రోజుల నుంచి 4–8–147 డోర్ నంబరు ఇంటి ముందున్న మ్యాన్‌హోల్ నుంచి మురుగునీటితో పాటు మలం సైతం వెలుపలకు వచ్చి వీధంతా దుర్గంధభరితంగా మారింది. తాజాగా రెండు రోజుల క్రితం నుంచి వీధి మధ్యలో మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. స్థానికులు కార్పొరేటర్ రేవతికి తెలియజేశారు. ఆమె సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీధిలో డ్రెయినేజీ కొత్త లైన్ వేయాల్సి ఉందని, రెండు రోజుల్లో పనులు చేపడతామని 20 రోజుల క్రితం తెలియజేశారు. ఇప్పటివరకు అధికారులు పట్టించుకోలేదు.

కాలువలు కనుమరుగు

ఈ వీధిలో డ్రెయినేజీ సమస్య ఇలా ఉంటే.. ఇంటి ముందున్న కాలువలను కొంతమంది పూడ్చివేసి మెట్లు కట్టేశారు. పక్కిళ్ల నుంచి వర్షపు నీరుగానీ, రోడ్డుపై వచ్చే నీరుగానీ తమ ఇంటి ముందు ప్రవహించకూడదని మెట్ల కింద కాలువను పూడ్చివేశారు. దీంతో డ్రెయినేజీ వ్యర్థాలు కాలువలో ప్రవహించే అవకాశం కూడా లేకుండాపోయింది. కార్పొరేషన్ సిబ్బంది వచ్చి ఇంటి ముందు కాలువ లేకుండా చేశారని అడిగితే మాటలతో ఎదురుదాడికి దిగుతున్నారు. మా ఇంటి ముందు మా ఇష్టం అంటూ ఏళ్ల తరబడి బూతులతో దాడిచేస్తున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

బొమ్మగుంట ప్రాంతంలో యూడీఎస్ కొత్తలైన్ వేసేందుకు రూ.20 లక్షలు మంజూరైంది. టెండర్ ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో మరో కాంట్రాక్టర్‌కు అప్పగించాం. నాలుగైదురోజుల్లో పనులు ప్రారంభిస్తాం. మ్యాన్‌హోల్ ఓవర్‌ఫ్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం. – రవీంద్రారెడ్డి, డీఈఈ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

కన్నెమ్మ కుటుంబానికి న్యాయం చేయండి



ధర్నా చేస్తున్న వడ్డెర సంఘం, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

రామచంద్రాపురం: మండలంలోని బీరమాకులకండ్రిగలో ఇటీవల మృతిచెందిన కన్నెమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆయన వడ్డెర సంఘం, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులతో కలిసి బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. స్పందించిన తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కన్నెమ్మ ఇంటి ప్రహరీగోడకు ఆనుకుని పోసిన మట్టిని తొలగించి బాధితుల కోరిక మేరకు స్థలాన్ని ఇచ్చినట్లు తెలిపారు.

దైవధ్యానమే సన్మార్గానికి మార్గం



త్రిదండి అహోబిలం రామానుజ జీయర్ స్వామి

తిరుపతి కల్చరల్: దైవధ్యానమే సన్మార్గానికి మార్గమని త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఉద్బోధించారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన ఆయన చిన్నబజారు వీధిలోని జిత్తు జ్యువెలరీ షోరూంనకు విచ్చే శారు. ఆయనకు షోరూం అధినేత జితేంద్ర సాదర స్వాగతం పలికారు. ఆధ్యాత్మికతతో పాటు సేవా దృక్పథం కలిగి ఉన్నప్పుడే మానవ జీవితానికి సార్థమని తెలిపారు. పేదలకు సహాయం చేయడమే సంపన్నుల లక్ష్యం కావాలని కోరారు.

సాయం చేసి నా తమ్ముడిని కాపాడరూ..!

తిరుపతి కల్చరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో నున్న తన తమ్ముడు వీరశేఖర్ (44)కు మెరుగైన వైద్య చికిత్స కోసం సాయం అందించి కాపాడాలని బాధితుడి అక్క లోకేశ్వరి వేడుకున్నారు. ఆమె బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అశోక్‌నగర్‌లో ఉంటున్న తన తమ్ముడు గత నెల 23న లక్ష్మీపురం సర్కిల్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బైక్‌లో వెళుతూ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడని వాపోయారు. చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రూ.23 లక్షలు ఖర్చు చేశామని, మరో రూ.30 లక్షలు అవసరమమని డాక్టర్లు తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు సేవా దృక్పథంతో ఆర్థిక సాయం అందించి వీరశేఖర్ ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సాయం చేసే దాతలు 8790767399లో సంప్రదించాలని కోరారు.

రక్తపోటుపై అవగాహన అవసరం



రక్తపోటుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పారామెడికల్ సిబ్బంది

చంద్రగిరి(తిరుపతి రూరల్): సర్వ వ్యాధులకు మూలమైన రక్తపోటుపై కళాశాల స్థాయి నుంచే విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఎంబీయూ ఉపకులపతి ఆచార్య నాగరాజ రామారావు తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా బుధవారం వర్సిటీలో పారామెడికల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తపోటు సమస్యలు ఎలా వస్తాయి, వాటి వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రక్తపోటు నివారణ, ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు తిరుపతిలోని ప్రముఖ ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సారథి, ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ రవిశేఖర్, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య రామ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



సచివాలయ రికార్డులను తనిఖీచేస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా : గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె బుధవారం 32, 33, 34 సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు, సంక్షేమ పథకాల అమలు, సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. యూజర్ ఛార్జీలను సకాలంలో వసూలుచేయాలని సూచించారు. 33వ డివిజన్ సచివాలయాన్ని ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరొక చోటుకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ దూదికుమారి, ఆమె భర్త దూది శివకుమార్ కోరారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

భూ సర్వే వేగవంతం

భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. ఆమె ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సర్వేను సకాలంలో పూర్తిచేయాలన్నారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, రెవెన్యూ ఆఫీసర్లు కే.ఎల్.వర్మ, సేతుమాధవ్, ఏసీపీ బాలసుబ్రమణ్యం, అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

రోడ్లను పరిశీలించిన డిప్యూటీ మేయర్



అధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ మేయర్

తిరుపతి తుడా : శ్రీనివాస సేతు బ్రిడ్జి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. రైల్వే బ్రిడ్జిపై నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వాహనాలను దారి మళ్లించారు. దీంతో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి బుధవారం ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులతో కలిసి రోడ్లను పరిశీలించారు. వాహనదారులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. కొత్తగా అభివృద్ధి చేసిన సామవాయి, వైఎస్సార్ మార్గ్, అన్నమయ్య మార్గ్ ద్వారా వాహనాల రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొత్త రోడ్లు ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడంతో పాటు నగరానికి కనెక్టివిటీ పెంచుతాయన్నారు. ఎస్ఈ మోహన్, ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప, ఎంఈ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయ్‌కుమార్ రెడ్డి, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపాక పెద్దగంగమ్మకు పూజలు చేస్తున్న భూమన అభినయ్ రెడ్డి

తాళ్లపాక గంగమ్మకు భూమన అభినయ్ పూజలు

తిరుపతి మంగళం : తిరుపతి గంగజాతరలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తాళ్లపాక పెద్దగంగమ్మకు బుధవారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సద్దా బాబు యాదవ్, సభ్యులు శారద, సూర్యప్రకాష్, రేవతి, లత, కాత్యాయని ఆయనకు శాలువా కప్పి సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం హర్షణీయం



థ్యాంక్యూ సీఎం అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముస్లింలు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే 1813 మందికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేయడంపై ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. వారు బుధవారం థ్యాంక్స్ సీఎం అంటూ ఖాద్రీ పీఠం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీల పక్షపాతిగా నిలిచారని తెలిపారు. ఈ ఏడాది ఏపీ నుంచి హజ్ యాత్రకు సుమారు 1813 మంది వెళుతున్నారని తెలిపారు. వారికి విమాన టికెట్‌పై రూ.80 వేలు అదనపు భారం పడడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి జగనన్న స్పందించి అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జీవో ఆర్‌టీ నెంబర్–114 జారీ చేసి ఈ నెల 15న రూ.14.51 కోట్లు విడుదల చేశారని వివరించారు. ముఖ్యమంత్రికి ముస్లింల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హాజీలు షేక్ పరీద్ సాహెబ్, ఏటీకే. మాలిక్, షేక్ మునిరామ్, హలీల్ భేగ్, షేక్ సాజహాన్, షేక్ శ్యామ్‌బాషా, షేక్ ఇబ్రహీం, సయ్యద్ టీపూఖాద్రి పాల్గొన్నారు.